సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం | 27 | జూలై | 2025



రూ.50,116 విరాళం


అంబాజీపేట: కొర్లపాటివారిపాలెం శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రంకిరెడ్డి పెదకాపు, పల్లాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రంకిరెడ్డి వీర రాఘవులు (అబ్బులు) రూ.50,116 విరాళం సమర్పించారు.



శ్రీవారి ఆలయానికి రూ.1,00,116

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన ఆకుల నాని, పద్మావతి దంపతులు శనివారం రూ.1,00,116 విరాళం అందజేశారు.

పెరుగుతున్న వరద ఉధృతి



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ వద్ద వరద పెరుగుతోంది. శనివారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 4,36,321 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1800, ప శిమ డెల్టాకు 3,700 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

డీఆర్‌ఓ సీతారామ మూర్తి



సమావేశంలో సూచనలిస్తున్న డీఆర్‌ఓ సీతారామమూర్తి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మే 2025 డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఆదివారం నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు 6 రోజుల పాటు నిర్వహించనున్నట్టు డీఆర్‌ఓ సీతారామమూర్తి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. స్థానిక రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో ఈ పరీక్షలకు సుమారు 3,771 మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతాయన్నారు. కన్వెన్షనల్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ సూచించారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు నుంచి కేంద్రంలోకి అనుమతించాలని, కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయాలని అర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంప్ తదితర చర్యలు చేపట్టాలని, పోలీసు భద్రత పటిష్టంగా పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎం.బాబర్, సెక్షన్ ఆఫీసర్ సీహెచ్ యోగేశ్వర రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీబీటీ హెల్ప్‌లైన్ ఏర్పాటు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కొంతమూరులోని ఎయిడెడ్ స్కూలుకు సంబంధించి ఆదివారం జరగనున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌కు హెల్ప్ లైన్ కేటాయించినట్లు డీఈఓ కె.వాసుదేవరావు శనివారం తెలిపారు. అభ్యర్థులు సమాచారం కోసం హెల్ప్‌లైన్ 83091 77952 నంబర్‌లో సంప్రదించి ఉదయం 8.00 గంటలోపు సమాచారం తెలుసుకుని పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు



రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలలో విద్యుత్ బిల్లుల వసూలు కౌంటర్లు ఆదివారం సెలవు దినమైనప్పటికీ పనిచేస్తాయని ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ శనివారం తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించాలన్నారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు, ఏపీ ఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్ లలో కూడా బిల్లులు చెల్లించవచ్చునని తెలిపారు.

సంక్షామ గృహాలు!



కడియం హాస్టల్‌లో నేలపై భోజనాలు చేస్తున్న విద్యార్థులు



అపరిశుభ్ర వాతావరణంలో తాళ్లపూడి సాంఘిక సంక్షేమ వసతి గృహం

- వసతి గృహాల్లో సమస్యల తాండవం
- అపరిశుభ్రత, తాగునీటికి ఇబ్బందులు
- నేలపైనే భోజనాలు
- నిరుపయోగంగా సీసీ కెమెరాలు
- హైకోర్టు ఆదేశాలు పట్టని ప్రభుత్వం


సాక్షి, రాజమహేంద్రవరం/నెట్‌వర్క్: అపరిశుభ్రతతో కూడిన పరిసరాలు, చాలీచాలని గదులు.. దోమలతో సహజీవనం.. నేలపై భోజనాలు.. వెరసి సంక్షేమ, రెసిడెన్షియల్ వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పేద విద్యార్థుల సంక్షేమం, వసతితో కూడిన విద్య అందించేందుకు నెలకొల్పిన గృహాల నిర్వహణ లోపం, అపరిశుభ్ర వాతావరణం కంపరం కలిగిస్తున్నాయి. నాణ్యమైన ఆహారం లేకపోవడం మరో సమస్య. సీసీ కెమేరాలు, ప్రహరీలకు విద్యుత్ ఫెన్సింగ్ లేకపోవడంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. సీసీ కెమెరాలు ఉన్నా సరిగా పనిచేయని పరిస్థితి. వసతిగృహాల్లో వసతులపై ఇటీవల హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ తరచూ ఆందోళన కలిగించే భయంకర ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన చెందింది. ఇలాంటి ఘటనలపై స్పందించకపోతే భావితరాలపై ఆ ప్రభావం పడుతుందని స్పష్టం చేసింది. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని అభిప్రాయపడింది. విద్యార్థులు భద్రంగా, సురక్షితంగా విద్య, వసతి పొందేలా చూడాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేసింది. జిల్లాలోని వసతిగృహాల్లో 'సాక్షి' చేపట్టిన ప్రత్యేక పరిశీలనలో అనేక సమస్యలు తేటతెల్లమయ్యాయి.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 36 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉండగా.. సుమారు 2,600 మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. బీసీ హాస్టళ్లు 24 ఉండగా 1,657 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఒక గురుకుల పాఠశాల ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

అన్నిచోట్లా ఇబ్బందులే..

- రాజమహేంద్రవరం నగరంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో ముగ్గురు వార్డెన్లు మూడు విభాగాలుగా పనిచేస్తున్నారు. వీరిలో 310 మంది విద్యార్థులున్నారు. వారిని ముగ్గురు వార్డెన్లకు సమానంగా విభజించారు.
- ఎస్సీ బాలుర హాస్టల్‌లో 90 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ తాగేందుకు రక్షిత నీరు లేదు. మున్సిపల్ నీటినే తాగుతున్నారు. ఆర్‌ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉంది.
- ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో వార్డెన్ లేరు. సమీప ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.
- ఎస్టీ బాలుర హాస్టల్‌లో వంట గది, చుట్టూ ప్రహరీ లేవు. ఆ ఆవరణలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ హాస్టళ్లకు స్కావెంజర్లు లేకపోవడంతో వార్డెన్లు సొంత డబ్బులతో ఏర్పాటు చేసి పనులు కానిస్తున్నారు.
- కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 3 నుంచి పదో తరగతి వరకు 29 మంది విద్యార్థులు ఉన్నారు. రూ.12 లక్షలతో చేపట్టిన హాస్టల్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇంకా ఫ్లోరింగ్, శ్లాబ్ లీకేజీ పనులు చేయాలి. కిటికీలకు మెష్‌లు లేవు. విద్యార్థులు దోమల బెడదతో బాధపడుతున్నారు. చుట్టుపక్కల వారు చెత్త వేయడంతో అపరిశుభ్రంగా ఉంది.
- రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో మూడు హాస్టళ్లు ఉన్నాయి. ధవళేశ్వరంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్, కడియంలో బీసీ బాలుర వసతి గృహం, ఎస్సీ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. ధవళేశ్వరం ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో గతంలో సాక్షిలో ప్రచురితమైన కథనాలకు ఫ్యాన్లు, కిటికీలకు, తలుపుల బాగు చేయించి దోమల మెష్‌లు వేశారు. మరుగుదొడ్లు బాగుచేయించారు. భవనానికి పెయింటింగ్ వేయాల్సి ఉంది.
- కడియం బీసీ బాలుర వసతి గృహంలో 13 మంది, ఎస్సీ బాలికల వసతి గృహంలో 25 మంది ఉంటున్నారు. వీరికి పాఠశాల దూరంగా ఉండడంతో తల్లిదండ్రులు ఇక్కడ చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. రెండు వసతి గృహాలకు రెండేసి మరుగుదొడ్ల అవసరం ఉన్నప్పటికీ విద్యార్థులు తక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. సబ్ మెర్సిబుల్ మోటారు సరిగా పని చేయక గోదావరి రక్షిత నీటిని వినియోగిస్తున్నారు. లైట్లు, ఫ్యాన్లు, వంట సామగ్రి, మిక్సీ, గ్రైండర్ ఇటీవలే ఇచ్చారు. రెండు భవనాలకు పెయింటింగ్స్ వేయాల్సి ఉంది.



అపరిశుభ్రంగా అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురం గురుకుల రెసిడెన్షియల్ హాస్టల్

- అనపర్తి నియోజకవర్గం అనపర్తి మండలంలో అనపర్తి శివారు లక్ష్మీ నరసాపురంలో గురుకుల రెసిడెన్షియల్ హాస్టల్ జూనియర్ కాలేజీ ఉంది. ఇందులో సుమారు 483 మంది చదువుతున్నారు. హాస్టల్‌లో డైనింగ్ హాలు, బయట పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తినేసి వదిలేసిన ఆహార పదార్థాలు, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశం అపరిశుభ్రంగా ఉన్నాయి. డైనింగ్ హాల్ ద్వారం వద్ద టైల్స్ శిథిలమయ్యాయి. ఈ హాస్టల్లో ఒకటి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు చదువుతున్నారు.

హైకోర్టు మార్గదర్శకాలు ఇలా..

- వసతి గృహం భవనం చుట్టూ సోలార్ ఎలక్ట్రికల్ ఫెన్సింగ్‌తో ప్రహరీ నిర్మించాలి. గేటు తప్పనిసరిగా ఉండాలి.
- విద్యార్థుల రాకపోకలు ఎంట్రీ, ఎగ్జిట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి.
- హాస్టల్ ప్రవేశ మార్గం, కామన్ ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలి. నీటి సదుపాయం కల్పించాలి.
- హాస్టళ్ల సిబ్బందికి ప్రవర్తనా నియమావళిని నిర్దేశించాలి. విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన, వేధింపులకు ఆస్కారం లేకుండా చూడాలి.
- జాతీయ శిశు సంరక్షణ ప్రమాణాలకు అనుగుణంగా హాస్టళ్లు ఉండాలి. ఇలా అనేక మార్గదర్శకాలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా ఒక్క వసతి గృహంలోనూ ఈ మార్గదర్శకాలు పూర్తి స్థాయిలో అమలవుతున్న దాఖలాలు లేవు.



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఎస్సీ బాలికల వసతి గృహంలో పనిచేయని ఆర్వో ప్లాంట్



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల బాలుర వసతి గృహంలో ఊచలు ఊడిపోయిన కిటికీ



తాళ్లపూడి సాంఘిక సంక్షేమ వసతి గృహం కిటికీకి కానరాని మెష్



అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురంలో గురుకుల రెసిడెన్షియల్ హాస్టల్‌లో వెనక్కుతిప్పిన కెమెరాలు

వేతన సవరణకు సానుకూలం



- ఇది పేపర్ మిల్లు కార్మికుల విజయం
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్ర పేపర్‌మిల్లులో పనిచేసే శాశ్వత ఉద్యోగులకు వేతన సవరణపై మిల్లు యాజమాన్యం సానుకూలంగా స్పందించడం కార్మికుల విజయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పేపర్ మిల్లు యాజమాన్య వైఖరి, కార్మికుల సమస్యల పరిష్కారానికి తాను చేపట్టిన ఆందోళన వల్ల కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ.. పూర్తిగా కార్మికులకు న్యాయం జరగలేదన్నారు. శాశ్వత ఉద్యోగులకు మంచి చేస్తూనే కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల డిమాండ్ల సాధనలో పోరాటం కొనసాగుతుందన్నారు. కార్మికుల పక్షాన పోరాడేందుకు జక్కంపూడి కుటుంబం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. వాస్తవానికి గతంలో జరిగిన వేతన ఒప్పందాల కంటే ఇది గొప్పగా లేకపోయినా, పరిశ్రమ మేలు కోరుకునే వారిగా కార్మికులే కొంతమేర రాజీపడి యాజమాన్యంతో జరిగిన వేతన సవరణ చర్చలలో తమ అంగీకారాన్ని తెలిపారన్నారు. కేవలం తాము పని చేస్తున్న పరిశ్రమ బాగుండాలనే ఏకైక లక్ష్యంతో యాజమాన్యం మొండి వైఖరిని భరించి సామరస్యంగానే సమస్యను పరిష్కరించుకోవాలని వేచి చూసి తమ విజ్ఞత చాటుకున్నారని అభినందించారు. వేతన సవరణ విషయంలో సహకరించిన కార్మిక నేతలకు, అధికారులకు, భాగస్వాములైన వారికి రాజా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని సంహిత కన్వెన్షన్ హాల్లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు, జిల్లాలో ఎస్సీసెల్ నాయకులు పాల్గొంటారన్నారు. పార్టీకి చెందిన ఎస్సీసెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వేణు కోరారు.

కక్ష పూరితంగానే మిథున్ రెడ్డి అరెస్టు

మాజీ ఎంపీ భరత్ రామ్



సెంట్రల్ జైలు వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కక్షపూరితంగానే ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు జరిగిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఆయనకు సౌకర్యాలు కల్పించాలంటూ వేసిన పిటిషన్‌పై ఇచ్చిన ఆదేశాలపై ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయడాన్ని బట్టి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్టు అర్థం అవుతోందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో అయితే 40 ఏళ్లగా చంద్రబాబుకి వైరం ఉండొచ్చని, అది అడ్డం పెట్టుకుని ఆయన కొడుకుని ఇలా ఇబ్బంది పెట్టి ఆనందం పొందడం ఎంతవరకు సబబన్నారు. చివరకు మిథున్ రెడ్డిని భార్య, పిల్లలు కలవడానికి వస్తే కూడా ఏదో రకంగా ఆపే ప్రయత్నం చేస్తూ వచ్చారన్నారు. అసలు ప్రభుత్వ మద్యం పాలసీలో నష్టం ఎక్కడ వచ్చిందని, ఎక్కడా అవకతవకలు జరగలేదన్నారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే సరికి రూ.18 వేల కోట్ల మేర మద్యం ద్వారా ఆదాయం ఉండేదని, అదే జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.25 వేల కోట్లకు పెరిగిందన్నారు. మరి రూ 3,200 కోట్లు అవినీతి ఎలా నిరూపిస్తారని ప్రశ్నించారు. 2019కి ముందు చంద్రబాబు ప్రభుత్వంలో డిస్టిలరీలకు ప్రివిలేజ్ ఫీజు తగ్గించడం వలన ప్రభుత్వ ఖజానాకు రూ.3 వేల కోట్ల నష్టం వచ్చిందన్నారు. అది కదా స్కామ్, క్విడ్ ప్రోకో అంటే అన్నారు. ఇవన్నీ ప్రజలు అంతా గమనిస్తున్నారని భరత్ అన్నారు.

లిటిల్ బడ్స్ బర్త్‌డే.. ట్రెండీగా!

నెలకో పండగ.. ఏడాదికో ఉత్సవం



యశశ్వి ఏడో నెల పుట్టిన రోజు సందర్భంగా బత్తాయిలను ఏడు అంకెగా అమర్చి శ్రీకృష్ణునిగా అలంకరించిన తల్లిదండ్రులు

- సరికొత్తగా అలంకరణ
- విభిన్న థీమ్‌లతో నిర్వహణ
- ఏడాది పొడవునా సంబరాలు

రాజమహేంద్రవరం రూరల్: ఏ ఇంట అయినా క్యార్‌మని శబ్దం ఎప్పుడు వినిపిస్తుందా అని ఎదురుచూడని దంపతులు ఉండరు. ఆ రోజు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ. అది ఫలించిన నాడు ఆ ఇంట అంతకు మించిన పండగ ఏముంటుంది. ఆ బిడ్డ పెరుగుదలలో ప్రతి అంకం ఆ ఇంట ఓ ఉత్సవమై అలరారుతుంది. గత తరాల అమ్మమ్మల సంప్రదాయం.. నేటి అమ్మల ట్రెండీనెస్ కలగలసి బుజ్జాయిల పుట్టిన రోజులు థీమ్‌లుగా రూపాంతరం చెందుతున్నాయి. గత తరాల అమ్మమ్మలు శిశువు రెండో నెలలో నవ్వితే నువ్వుండలు చేసి పంచడం.. మూడో నెలలో బోర్లా పడితే బొబ్బట్లు చేసి సందడి చేయడం.. ఆరో నెలలో పాకడం మొదలుపెట్టగానే పరమాన్నం వండి నోరు తీపిచేయడం.. ఏడో నెల గడప దాటితే గారెలు వంటి సరదాగా దండ వేసి పంచడం.. పదో నెలలో అడుగులేస్తుంటే అరిసెలు వండడం.. అందరికీ తెలిసిందే. నేటికీ చాలా ఇళ్లలో ఈ సందడి కనిపిస్తున్నా వీటికి అదనంగా ప్రతి నెలా పుట్టినరోజు చేస్తూ తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. అది కూడా ట్రెండీగా. ఏడాది పాటు ప్రతి నెలా ఒక్కో థీమ్‌తో పుట్టిన రోజును చేస్తున్నారు. ఆ పన్నెండు నెలల జ్ఞాపకాలను ఫొటో ఫ్రేమ్‌లు, వీడియోల రూపంలో క్రోడీకరించి మొదటి ఏడాది పుట్టినరోజును వైభవంగా నిర్వహిస్తూ బంధుమిత్రులకు చూపి, సోషల్ మీడియాలో పోస్టుచేసి లైక్‌లకు, కామెంట్లకు మురిసిపోతున్నారు. నయా బర్త్‌డే సెలబ్రేషన్స్‌పై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.

ప్రతి నెలా పండగే



మా గారాలపట్టి యశశ్వి పుట్టినరోజును ప్రతి నెలా ఓ వేడుకలా చేసుకుంటున్నాం. కుటుంబసభ్యులంతా కలిసి సందడి చేస్తాం. పిల్లల చిన్నప్పటి ఫొటోలు భద్రంగా ఉంచితే పెద్దయ్యాక చూసి మురిసిపోతారు. ప్రతినెల కొత్త బట్టలు వేసి ఒక్కో రకమైన వస్తువులు, ఇతర పండ్లతో నెలల నంబర్లు వేసి ఫొటోలు తీసుకుంటాం. ఏడాది పాటు ఈ ఫొటోలను భద్రపరచి ప్రదర్శిస్తాం.

– సుకీర్తి, సచివాలయ ఉద్యోగి, నగరం



చాక్లెట్లను రెండు ఆకారంలో అమర్చి ఆద్య రెండో నెల బర్త్‌డే నిర్వహించిన తల్లిదండ్రులు

ఒక మధుర జ్ఞాపకం



ప్రస్తుతం పిల్లల పుట్టిన రోజులు నెలవారీగా చేస్తూ ఫొటోలు తీయడం సంప్రదాయంగా మారింది. ఈ ఫొటోలు వారి శారీరక వృద్ధి, హావభావాలు, వ్యక్తిత్వ వికాసాలను నెలనెలా చిత్రీకరిస్తూ.. వా ప్రగతిని కళ్లకు కడతాయి. ఇది కేవలం వయసు పెరిగిన రోజు కాదని, వారి బాల్యంలో అమూల్యమైన క్షణాలను పదిలం చేస్తాయి.

– బి.హేమ, సైంటిస్ట్, రాజమహేంద్రవరం



నాలుగో నెల సందర్భంగా ఉద్వికకు మత్స్యకన్యగా అలంకరించి

కలకాలం గుర్తుండాలని...



బర్త్‌డేకి ఏడాది వరకు ఎదురు చూడడం ఎందుకని.. నెలనెలా ఒక్కో థీమ్‌తో మా పాపను రెడీ చేశా. ఫొటోలు తీసి భద్రంగా ఉంచా. పెద్దయ్యాక చూపిస్తే తను కూడా సంబరపడుతుంది. ఒకప్పుడంటే కెమెరామన్ వచ్చి ఫొటోలు తీసేవాడు. ఇప్పుడు ఫోన్‌లోనే ఫొటోలు తీసి ఎడిటింగ్ చేస్తున్నా. మంచి పాటను యాడ్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పెడితే చాలా లైక్‌లు, కామెంటు వస్తున్నాయి.

– వలవల దేదీప్య, గృహిణి, మోరంపూడి



అనిరుథ్‌కు చెఫ్ టోపీ పెట్టి పిండితో పదో నెలను అలంకరించిన దృశ్యం

అదో మధురానుభూతి



ఏడాదికి ఓ బర్త్‌డే నుంచి నెలనెలా వేడుకలు జరుపుకోవడం కొత్త ట్రెండ్. మాకు ఇద్దరు అబ్బాయిలు. పెద్దవాడు అభిరామ్‌కు నెలనెలా కొత్త బట్టలతో అలంకరించి పండ్లు, స్వీట్లు, చాక్లెట్స్‌తో అలంకరించాం. ఇప్పుడు చిన్నవాడు అనిరుథ్‌కు కూడా అలాగే చేస్తున్నాం. ఇది వారి జీవితంలో మధురానుభూతిగా నిలిచిపోతుంది. ప్రతి నెల ఫొటోలను భద్రంగా ఉంచి, ఏడాది పూర్తయిన తరువాత అన్నీ కలిపి ఫ్రేమ్ చేయించి ఇంటిలో పెట్టుకుంటాం.

– అడ్డాల ఇందుమాధురి, గృహిణి, బొమ్మూరు

క్లుప్తంగా

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



అప్పనరామునిలంకలో రోడ్డు మార్జిన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆగిన బస్సు

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో శనివారం 40 మంది విద్యార్థులతో ప్రయాణిస్తున్న కాన్వెంట్ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గ్రామంలో ఆ బస్సు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అనుకుని ఆగింది. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. దీంతో విద్యార్థులు ప్రమాదం నుంచి బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మరమ్మతులు చేయకుండా రోడ్లపైకి వస్తున్న ఇలాంటి బస్సులపై రోడ్ ట్రాన్స్‌పోర్టు అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే డ్రైవర్ల ఫిట్‌నెస్‌పై కూడా దృష్టి పెట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్ విజ్ఞప్తి చేశారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

రెండు తాడిపెద్దుల మృతి

తుని: స్థానిక మార్కెట్ యార్డులో విద్యుత్ తీగలు తెగిపడిన సంఘటనలో రెండు తాడి పెద్దులు మృతి చెందాయి. శనివారం ఉదయం పశువులు ఆ మార్కెట్‌లోని వ్యర్థాలను తింటుండగా ఒక్కసారిగా విద్యుత్ తీగలు పడటంతో రెండు తాడిపెద్దులు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ సమయంలో జనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ శాఖ లైన్ల నిర్వహణ సమయంలో తగు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరారు.



తుని మార్కెట్ యార్డులో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన తాడిపెద్దులు

ప్రాణాలు పోయినా పట్టించుకోరా!

- రహదారులు దిగ్బంధించి మత్స్యకారుల నిరసన
- కాకినాడలో తీవ్ర ఉద్రిక్తత
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు

కాకినాడ క్రైం: నగరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం తాళ్లరేవు సమీపంలో పటవల వద్ద చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, బాధిత కుటుంబాలు మత్స్యకార నేతల ఆధ్వర్యంలో న్యాయ పోరాటానికి దిగాయి. న్యాయం చేయాలని రోడ్డెక్కాయి. ఈ పరిస్థితి నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ప్రధాన కూడళ్లలో మూడుచోట్ల రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపారు. రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సమన్వి ట్రావెల్స్ అధినేత రావాలని, ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న కాకినాడ జీజీహెచ్ మార్చురీ వద్ద మత్స్యకార నాయకుడు సంగాడి ఈశ్వరరావు సహా పెద్దలు నిరసన వ్యక్తం చేశారు. 60 మందితో మొదలైన ఈ నిరసన వెయ్యి మందికి చేరుకుంది. తొలుత జీజీహెచ్ వద్ద వార్ఫ్ రోడ్డులో బాధిత కుటుంబీకులు రోడ్డుపై బైఠాయించారు. అక్కడి నుంచి ర్యాలీగా వాహనాలతో కాలినడకన వెళ్లి జగన్నాథపురం కొత్త వంతెనపై నిరసన తెలిపారు. జగన్నాథపురం నుంచి వార్ఫ్ రోడ్డు నుంచి వెళ్లే మార్గాన్ని దిగ్బంధించారు. అక్కడి నుంచి పాత వంతెనపైకి వెళ్లి నిరసన తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, సమన్వి ట్రావెల్స్ అధినేతను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆ అధినేత అమర్‌నాథ్ యాత్రలో ఉన్నారని పోలీసులు చెప్పడంతో ఒక్కసారిగా మత్స్యకారులంతా మండిపడ్డారు. ప్రాణాలు తీసేసి యాత్రలు చేస్తుంటే కళ్లకు గంతలు కట్టుకున్నారా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే సహా డిప్యూటీ సీఎం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



పోలీసులు, మత్స్యకారుల మధ్య వాగ్వాదం



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



రోడ్డుపై బైఠాయించిన మృతుల కుటుంబీకులు

కానరాని కొండబాబు

తన సామాజిక వర్గ పేదలు, అందులోనూ మహిళలు ప్రాణాలు కోల్పోతే కాకినాడ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్పందించిన తీరుపై మత్స్యకార నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. బాధితులు ఆయన దగ్గరకు వెళితే, బీమా వచ్చాక పరిహారం అందుతుందని, పరోక్షంగా తానేమీ చేయలేనని చేతులెత్తేశారని మత్స్యకారులు వాపోయారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆయన ఇంటికి కొద్ది దూరంలోనే నినాదాలు చేశారు. శుక్రవారం జీజీహెచ్‌కు వచ్చి మీడియాకు పోజులిచ్చి వెళ్లిపోయారని వారన్నారు. తన సొంత సామాజిక వర్గానికే న్యాయం చేయలేని వ్యక్తి కాకినాడకు ఏం చేస్తారని బాహాటంగానే విమర్శించారు. ముగ్గురు నిండు ప్రాణాలు పోతే ఇంతేనా చేసేదంటూ ప్రశ్నించారు.

మృతదేహాల తరలింపు

ఉద్రిక్తత తీవ్రరూపం దాల్చుతున్న తరుణంలో నిరసనకారులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో బస్సు యాజమాన్యంతో మాట్లాడిన పోలీసులు మత్స్యకార పెద్దలతో ప్రాథమిక దశ చర్చలు నిర్వహించి, నిరసనకు తాత్కాలిక విరమణ ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

క్షతగాత్రురాలికి కొనసాగుతున్న చికిత్స

ప్రమాద ఘటనలో గాయపడిన ఓలేటి లక్ష్మి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమెకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఎడమ కాలు, చేయిలో ఎముకలు విరిగాయని, శస్త్రచికిత్స చేస్తామని అన్నారు.

ఏయూ దూర విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రాయూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ద్వారా డిగ్రీ కోర్సులు అభ్యసించాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ కందుల ఆంజనేయులు శనివారం తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఎంకామ్, ఎంఏ, ఎంఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఇతర వివరాలకు 91543 79059 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

బీరు సీసాతో దాడి

తాళ్లపూడి: పెద్దేవంలో ఓ వ్యక్తిపై బీరు సీసాతో కొట్టి హత్యాయత్నం చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం .. స్థానిక వైన్ షాపు సమీపంలో వరిగేటి చంటబ్బాయి పాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి సమయంలో యల్లా దివ్యతేజ, డీజే ఉదయ్ దొమ్మేరు గ్రామానికి చెందిన మరో ముగ్గురు కలసి ఎగ్ ఆమ్లెట్ ఆర్డర్ ఇచ్చారు. తిన్న తరువాత డబ్బులు ఇవ్వకుండా, అడిగినా సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు. కొంత సమయం తరువాత మమ్మల్నే డబ్బులు అడుగుతావా అంటూ చంటబ్బాయిపై బీరు బాటిల్‌తో తలపై కొట్టడంతోపాటు చేతులు కాళ్లతో గాయపరిచారు. బాధితుడు తాళ్లపూడిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని హెడ్ కానిస్టేబుల్ ముదయ్య తెలిపారు.

హత్యాయత్నం కేసులో మరో ఇద్దరి అరెస్ట్

అమలాపురం టౌన్: అయినవిల్లి మండలం వెలవెలపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు, ఒకేషనల్ కళాశాల అధ్యాపకుడు దోనిపాటి మహేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో మరో ఇద్దరు నిందితులను అమలాపురం పట్టణ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మహేష్‌పై దాడి చేసిన ఆరుగురిలో ఇప్పటికే అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పర్యవేక్షణలో ముగ్గురిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో అమలాపురం అశోక్‌నగర్‌కు చెందిన మల్లాడి సుదర్శన్, ఇమ్మిడివరప్పాడుకు చెందిన తోట నాగవెంకట సత్యనారాయణలను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరిని అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో ఇళ్ల వద్ద అరెస్ట్ చేసి, వారి నుంచి నేరానికి ఉపయోగించిన ఒక మోటారు సైకిల్, మూడు సెల్‌ఫోన్లు, బాధితుడు మహేష్ వద్ద లాక్కున్న ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.వీరబాబు తెలిపారు. నిందితులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేయాల్సి ఉందని అన్నారు.

ఆరోగ్యవంతం.. కోరంగి మడ అటవీ ప్రాంతం



కోరంగిలో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజర్ వరప్రసాదరావు

తాళ్లరేవు: దేశంలోనే రెండో అతిపెద్ద మడ అటవీ ప్రాంతమైన కోరంగి అభయారణ్యం కల్‌కతాలోని సుందర్‌బన్స్‌తో పోలిస్తే ఆరోగ్యవంతమైందని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఎస్ఆర్ వరప్రసాదరావు అన్నారు. శనివారం కోరంగి బయోడైవర్సిటీ కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవాన్ని వరప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరింగ అభయారణ్యంలో ఏడాదికి నాలుగు నెలలపాటు గోదావరి నీరు పుష్కలంగా లభించడంతో ఆరోగ్యవంతమైన వృక్ష, మత్స్య సంపద అభివృద్ధి చెందుతుందన్నారు. సునామీలు, తుపాన్ల నుంచి రక్షించే మడ అడవులను హోప్ ఐలాండ్ దీవిలో పెంచుతున్నట్లు తెలిపారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త కె.మృత్యుంజయరావు మాట్లాడుతూ మడ అడవులు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి 111 రకాల వలస పక్షులు వస్తున్నాయని, వాటిలో చాలావరకు సముద్ర పక్షులేనని తెలిపారు. ఫిషింగ్ క్యాట్ నిపుణులు కునాల్ గోకుల్, అల్ ఈజ్ వెల్ అధ్యక్షుడు ఎస్.కిషోర్‌కుమార్ తదితరులు మడ అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణ తదితర అంశాలను వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు సింగ వీరభద్రరావు, కుంచే సిద్ధార్థ, ఎఫ్‌బీఓలు కె.మహేష్, కె.ధనుంజయరావు, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, డి.మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

- అడుగంటుతున్న ప్రజాస్వామ్య విలువలు
- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని శ్యామలాంబ ఆలయ సెంటర్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యనారాయణరావు మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల ముందు రోజు కావాలనే అరెస్టు చేసినట్లు కనిపిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో కీలకమైన భావ ప్రకటన హక్కుని, వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య విలువలు అడుగంటిపోతున్నాయని సూర్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. బ్రిటిష్ వారు వదిలిన లెగసీని ప్రస్తుతం పోలీసులు అందిపుచ్చుకున్నారని అన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్, రాజ్యాంగ పండితులు ప్రజాస్వామ్యాన్ని ఉన్నత విలువలతో నిలబెట్టాలని చూశారన్నారు. రాజ్యసభలో ప్రభుత్వానికి బలం లేనప్పుడు మిథున్ రెడ్డి కీలకంగా వ్యవహరించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడారని ఆయన అన్నారు. ఒక సాధారణ వ్యక్తిగా ఎలాంటి హంగూ ఆర్భాటం లేని మిథున్‌రెడ్డి వ్యక్తిత్వం రెండేళ్లుగా ఆయనతో చేస్తున్న ప్రయాణం వల్ల తనకు తెలిసిందన్నారు. రాజకీయ నాయకుడి కంటే, మామూలు వ్యక్తిగానే ఆయన వ్యవహరిస్తారన్నారు. విచారణకు సహకరించేవాళ్లను అరెస్టు చేసి ఇబ్బంది పెట్టడం పోలీసులకు తగదన్నారు. ఇండియన్ పోలీస్ యాక్ట్‌ను అతిక్రమిస్తున్నారని ఆయన వాపోయారు. మిథున్‌రెడ్డిని భేషరతుగా బెయిల్‌పై విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారం ఉంది కదా అని ఆధారాలు లేకుండా అరెస్టు చేస్తే ఎలాగన్నారు. ప్రజాస్వామ్య పోకడలు ఎక్కడికి పోతున్నాయని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డిని ప్రధాని మోదీ కౌగిలించుకుని వెన్నుపోటు పొడిచారని, ఇప్పుడు మంత్రి లోకేష్‌ని మోదీ కౌగిలించుకున్నారని రేపటి పరిస్థితి ఏంటో అని ఛలోక్తి విసిరారు. మిథున్‌రెడ్డితో ములాఖత్ కోసం ప్రయత్నిస్తున్నానని, ఇస్తారో లేదో చూడాలని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం, అమలాపురం లీగల్ సెల్ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, ఎం.ప్రసాద్, పిల్లి గంగాధర్, కురుమిల్లి శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. కాకినాడ డీసీసీబీ కార్యాలయంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 52 డీసీసీబీ బ్రాంచ్‌ల్లో మేనేజర్లు, ఇతర సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నష్టాల బాటలో ఉన్న డీసీసీబీని రెండేళ్లలో లాభాల బాటలో నడిపించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రుణాల వసూళ్లు బాగుంటేనే డీసీసీబీ బాగుంటుందన్నారు. గతంలో బినామీ పేర్లతో రుణాలు అధికంగా ఇచ్చిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా రుణాల మంజూరుకు సహకరించిన బ్యాంకు సిబ్బందిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయా రుణాలను వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. పిఠాపురం బ్రాంచ్ పరిధి బి.కొత్తూరు గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులు రుణాలు తీసుకుని తిరిగి కట్టడం లేదన్నారు. చిన్న గ్రామమైనప్పటికీ ఆ గ్రామంలో లేనివారి పేర్లతో కూడా రుణాలు తీసుకుని బ్యాంకుకు ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం ఇటువంటి రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ తరహా రుణాల మంజూరుకు ఏపీ అధికారులు సహకరించారో వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం అన్నీ బ్రాంచ్‌లు సిబ్బందిని ఎంత మేర రుణాలు ఇచ్చారు, ఎంత తిరిగి చెల్లించారు, రుణాలు రికవరీకి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈఓ ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నమెంట్‌కు విరాళం



కలెక్టర్ షణ్మోహన్‌కు చెక్కు అందజేస్తున్న విజయ ప్రకాష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఆగస్టులో నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ జాతీయ జూనియర్ మహిళా టోర్నమెంట్‌కు శ్రీప్రకాష్ విద్యాసంస్థలు రూ.2 లక్షల సహకారం అందించాయి. జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ శనివారం కలెక్టర్ చాంబర్‌లో చెక్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలకు సహకరించడం సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.